మేలు జరిగితే ఆత్మహత్యలెందుకు?

● తెలంగాణ రైతు సంఘం
రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు

ఎల్కతుర్తి : రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలతో మేలు జరిగితే రైతుల ఆత్మహత్యలు ఎందుకు చోటు చేసుకుంటున్నాయని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ప్రశ్నించారు. మండలంలోని దామెర గ్రామానికి చెందిన మహిళా రైతు ఆవుల ఐలమ్మ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని చందర్‌రావు ఆధ్వర్యంలోని బృందం మంగళవారం పరామర్శించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందర్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, తదితర పథకాలతో రైతు కుటుంబాలను ఆదుకుంటున్నామని ఊదరగొడుతున్నా సదరు పథకాలు పొందడంలో ఎదురౌతున్న సమస్యలను తాళలేక రైతుల కుటుంబాలు వేదనకు గురౌతున్నాయని చెప్పారు. వందలాది ఎకరాలున్న భూస్వాములకు కాకుండా 15 ఎకరాలోపు భూము లున్న పేద రైతులకు మాత్రమే రైతుబంధు, రైతు బీమా వర్తింపజేస్తే మంచిదన్నారు. 60 ఏళ్లకు పైబడ్డ రైతులు వివిధ కారణాలతో మృతి చెందితే బాధిత కుటుంబాలకు రైతుబీమా వర్తించక రోడ్డున పడ్డ ఘటనలు కోకొల్లలని చెప్పారు. సాగుదారుల కుటుంబాన్ని యునిట్‌గా తీసుకుని వయస్సుతో నిమిత్తం లేకుండా మృతి చెందిన రైతుల కుటుంబాలకు రైతుబీమా వర్తించేలా సవరించాలని, రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వగలిగేలా వ్యవసాయంలో నూతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్, నాయకులు రాకేష్ రాజు, మహేష్ రాజు, ఆవుల రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చందర్‌రావు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నిమ్మ కవిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల నివేదికలు చదివి వినిపించారు. ముప్పారం ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ ఇనుప స్తంభాలే ఉన్నాయని, వాటి వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సిమెంట్ స్తంభాలు వేయించాలని ఆయన కోరారు. ఎంపీపీ నిమ్మ కవిత మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ అధికారులు గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలు వేయాలని, ఐకేపీ సాయంతో అవగాహన కల్పించాలని కోరారు. మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. మండల మహాసభకు ఎక్సైజ్, మైన్స్, సహకార శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, తహసీల్దార్ రజని, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మ కవిత

క్లుప్తంగా

ప్రభుత్వ తీరుతోనే సర్పంచ్ ఆత్మహత్య

● బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు వల్లే మండలంలోని హైబోత్‌పల్లి సర్పంచ్ కంచ కుమారస్వామి ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. కుమారస్వామి మృతి చెందగా ఆయన మృతదేహానికి బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. ఏకగ్రీవంగా గెలిచిన పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికీ నిధులివ్వలేదని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే సర్పంచ్ కుమారస్వామి కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని తెలిపారు. కుమారస్వామి వైద్యం చేయించుకోవడానికి డబ్బులు కూడా లేవని చెప్పారు. కుమారస్వామి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుమారస్వామి మృతదేహానికి వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేష్, జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నేడు (బుధవారం) మండలానికి రానున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.1.70 కోట్లతో నిర్మించిన కట్టుకాలువను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, పెద్దచెరువు నుంచి బ్రాహ్మణపల్లి చెరువులోకి నీటిని విడుదల చేయనున్నారని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్‌ఎస్ శ్రేణులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు నర్సింహస్వామి జయంతి వేడుకలు

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రేపు (గురువారం) నర్సింహస్వామి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం, 108 కలశాలచే దేవమూర్తులకు అభిషేకాలు, సుదర్శన హోమం, కళ్యాణ మహోత్సవం ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలు హాజరై వేడుకలను తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీనివాసాచార్యులు ఆకాంక్షించారు.

ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్‌గా ప్రతాప్



ధర్మసాగర్ : ఎంఎస్పీ మండల ఇన్‌చార్జిగా పాడిశెట్టి ప్రతాప్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రతాప్ విలేకరులతో మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి



ఎల్కతుర్తి : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గాజుల ఐలయ్య అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఐలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు ఆయన్ను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. కాగా ఆయన పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బాలుడు అదృశ్యం



పరకాల : పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వరస్వామి ఆలయ వాచ్‌మెన్ నేరెళ్ల సుధాకర్ కొడుకు అఖిల్ కనిపించకుండా పోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా జాడ తెలియకపోవడంతో అతడి తల్లిదండ్రులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అఖిల్ ఓపెన్ ఇంటర్ పరీక్ష రాస్తున్న అతడి స్నేహితుడి తల్లిని కలిసి వస్తానని చెప్పి సోమవారం ఉదయం 10 గంటలకు వెళ్లి తిరిగి రాలేదని అతడి తల్లిదండ్రులు రజిత-సుధాకర్ కన్నీరు మున్నీరౌతున్నారు. అఖిల్ పదో తరగతి చదువుతున్నాడని వారు చెప్పారు. ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది. అఖిల్ తీసుకెళ్లిన సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు


హోమంలో పాల్గొన్న సింగిల్ విండో చెర్మన్ దంపతులు రవీందర్‌గౌడ్-రమ


మంత్రపుష్పం చేస్తున్న సర్పంచ్ దంపతులు రజిత-దేవేందర్‌రావు

ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో మూడ్రోజులపాటు నిర్వహించనున్న భూలక్ష్మీ, మహాలక్ష్మీ సహిత గ్రామశిల బొడ్రాయి పతిష్టాపన వేడుకలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహ వాచనము, అఖండ దీపస్థాపన, అంకురార్పణ, పర్యగ్నికరణం, యాగశాల ప్రవేశం, రుత్విక్ వరణం, దీక్షా స్వీకరణ, మండప స్థాపనలు, విగ్రహాల ఊరేంగిపు, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. రెండో రోజు మంగళవారం స్థాపిత దేవతాపూజలు, ఆవాహం, హోమాలు, జలాధివాసం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగింది. నేడు (బుధవారం)మంటప స్థాపిత దేవత పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బోయినపల్లి రజిత-దేవేందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ తెలిపారు. వేడుకల్లో గ్రామ ప్రజలు పాల్గొని హోమాలు నిర్వహించారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



కమలాపూర్ : మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ బోనాలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గీత కార్మిక కుటుంబాలు ఇంటికో బోనం తలకెత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల పరశురాములు, ఉపాధ్యక్షుడు మండ అశోక్, కోశాధికారి పబ్బు రమేష్, డైరెక్టర్లు కూనూరు రంజిత్‌కుమార్, జక్కు రాజు, పచ్చిమట్ల రాజేష్, బాలసాని రమేష్, మార్క అశోక్, జేరిపోతుల పుల్లయ్య, కారోబార్ పబ్బు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

దామెర : పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పోలీసు సిబ్బంది పని తీరును పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడారు. సమస్యలపై పోలీస్‌స్టేషన్ వచ్చే ప్రజల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కార దిశగా సమర్థవంతంగా పని చేయాలన్నారు. బాలికలు, మహిళలు, వృద్ధుల సమస్యల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని తేటతెల్లం చేశారు. ఆయన వెంట పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ముత్యం రాజేందర్, ఏఎస్సైలు సిద్దయ్య, రాజు తదితరులున్నారు.


పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో అధ్యయన బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, అంకురారోహణ, ధ్వజారోహణం, గరుడ ముద్ద, సాయంత్రం బేరిపూజ, దేవత అహ్వానం, హోమం, బలిహరణం కార్యక్రమాలను అర్చకులు మాధవమూర్తి, నర్సింహాచార్యులు వేద మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను తిలకించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి, పర్వతగిరి రాజు, భాషబోయిన సాగర్, పాపని రవీందర్, మునుకుంట్ల సతీష్, పలకల బుచ్చిరెడ్డి, రామకృష్ణ, సందీప్, శ్యామ్ పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఆంజనేయస్వామి విగ్రహానికి చందన అలంకరణ



శాయంపేట : మండలంలోని మైలారంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆంజనేయస్వామి విగ్రహానికి వైద్యుల మధుసూదన్‌రెడ్డి చందన అలంకరణ చేసి మొక్కు తీరుకున్నారు. అనంతరం హనుమాన్ దీక్షాదారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మాలదారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఐనవోలు : ఎలాంటి షరతులు లేకుండానే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేష్ గౌడ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మెట రాజు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంథినిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిం మాట్లాడారు. గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రైతు నుంచి కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే రైతుల ధాన్యాన్ని కాంటాలు వేయించి మిల్లులకు పంపించడంలో చొరవ చూపడం లేదని విమర్శించారు. రైతుల వేదనను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మదూరి మల్లేశం, మదూరి చిన్న రాజు, సంజీవ, బండి రమేష్, సట్ల రాజు, తాళ్లపెల్లి రాజు, రైతులు రవీందర్, కొమురయ్య, రమేష్, రాజు పాల్గొన్నారు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్, నడికూడ, నర్సక్కపల్లి, పులిగిల్ల, వరికోల్‌లో మాదారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కొడెపాక సుమలత మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి, వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి, సర్పంచ్‌లు తిప్పర్తి సాంబశివారెడ్డి, పాలకుర్తి సదానందం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, కరుణాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పచ్చిరొట్ట ఎరువుల వినియోగం మేలు

శాయంపేట : వ్యవసాయంలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం మేలని మారి స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ మేనేజర్ షేక్ గౌస్ తెలిపారు. మండలంలోని గంగిరేణిగూడెంలో ప్రజ్వల్ సొసైటీ ఆధ్వర్యంలో ×నేలలో పోషక లోపాలు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం×పై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను లభిస్తాయని చెప్పారు. పంటల దిగుబడి ఎక్కువగా సాధించి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతు కృష్ణమూర్తి, మారి సంస్థ కార్యకర్తలు హిమబిందు, కల్పన, భానుమతి, తిరుపతి, సునీల్, రవిచంద్ర, మనోహర్, ప్రశాంత్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షేక్ గౌస్

శివలింగ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామంలో ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న భవానీ సమేత సాంబమూర్తి (శివలింగ) పునరావర్తన ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు స్వర్గం రవికి సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు అహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు వారిని సర్పంచ్ దేవేందర్‌రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక ఇచ్చి మాట్లాడారు. సర్పంచ్ వెంట మాజీ జెడ్పీటీసీ మారెపెల్లి నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మొండెద్దుల రాజమౌళి, సీనియర్ నాయకులు నాయినేని తిరుపతిరావు, జక్కుల సదయ్య, ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, కొనుపుల రాంచందర్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

జీపీ కార్యాలయంలో ఎంపీఓ తనిఖీ



దామెర : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీఓ కుసుమ నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలని ఉద్యోగులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, నర్సరీ, ప్లాంటేషన్‌లను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి హరితహారం మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. గ్రామంలో ప్రతిరోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, వనసేవకులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇవ్వాలి

ఐనవోలు : వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు చొప్పున వెంటనే పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రైతులకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రైతులకు వర్తింపజేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని, మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఎల్కతుర్తి : ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహించనున్న విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను భీమదేవరపల్లి సబ్‌డివిజన్‌లో విద్యుత్ శాఖ ఏడీఈ రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వినియోగదారులందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిబంధలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సీహెచ్.శిరీష్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు సామ్యూల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

పరామర్శ

ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కుల రాజయ్య ఇటీవలే పాము కాటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. సురేందర్‌రెడ్డి కేశవాపూర్‌కు చేరుకుని రాజయ్య కుటుంబీకులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం వెలిబుచ్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సురేందర్‌రెడ్డి వెంట నాయకులు పిడిశెట్టి రాజు, ఎర్రగొల్ల రాజు, పాటి భగవాన్ తదితరులున్నారు.

పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

శాయంపేట : గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు వేయి రూపాయల వేతనం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ సిబ్బంది మంగళవారం సీఎం కేసీఆర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు మాట్లాడారు. పంచాయతీ మల్టీపర్పస్ ఉద్యోగుల వేతనం పెంచడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చిలువేరు మల్లేషం, ఉపాధ్యక్షులు అక్కినపల్లి యాకయ్య, బాసాని రమేష్, మోహన్, సాంబయ్య, సూర్యప్రకాశ్, చిత్తం లక్ష్మీ, పుష్ప, సరోజన, గీత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

హన్మకొండ: కార్మిక దినోత్సవం సందర్భంగా కేవలం రూ.వేయి వేతనం పెంచి మున్సిపల్ కార్మికులను సీఎం కేసీఆర్ వంచించారని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ, మున్సిపల్ కార్మికుల జేఏసీ నాయకుడు వేల్పుల ధర్మరాజు విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల కనీస వేతనం ఇవ్వాలని, వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, మున్సిపల్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గమంతా కార్మిక దినోత్సవాన్ని పండుగలాగా జరుపుకుంటే, రాష్ట్రంలోని 70 వేల మంది మున్సిపల్ కార్మికులకు కేవలం రూ.వేయి పెంచి వారిని సీఎం కేసీఆర్ అవమాన పరిచారని వాపోయారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి అన్ని కార్మిక సంఘాలు శ్రీకారం చుడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బరుపట్ల మహేష్, మున్నంగి రఘు, మూర్తి రాజు, వెంకటస్వామి, యాస బాబు, దామోదర్, సుఖ్‌దేవ్, కోటి, కుమార్, దేవమ్మ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు

ఫాదర్ జోరోమ్ గురు పట్టాభిషేక మహోత్సవం

మడికొండ : కాజీపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని జీవధార కేంద్రంలో ఫాదర్ జెరోమ్ 35వ గురు పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పేదలు, అనాథలు, మానసిక వికలాంగుల మధ్య మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 165 మంది మానసిక వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున నాలుగు నెలలకు రూ.6 వేలు చొప్పున ఆర్థిక చేయూత అందించారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పేద కుటుంబాలకు, పేద విద్యార్థులకు కూడా తన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు ఆశ్రమాల ప్రతినిధులు, సిస్టర్లు, మానసిక వికలాంగులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.